క్లుప్తంగా

వాసవీమాతకు పూజలు



ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

నందికొట్కూరు : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీర బొమ్మ నాగసత్యనారాయణ తెలిపారు. అమ్మవారి ఆత్మార్పణ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సుంచే శర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు దీపోత్సవం, మండపారాధన, ఏకాహం రెండో రోజు సుప్రభాత సేవ, విశిష్టఅభిషేకము, గణపతి పూజ, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారన్నారు.

16న గ్రామీణ బంద్



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, విద్యార్థి యువజన ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. వారు మాట్లాడుతూ గిట్టుబాటు ధర లేక 3 లక్షల మంది రైతులు నష్టపోతున్నారని అన్నారు. ప్రజలందరూ ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆనంద్, ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి

పాములపాడు: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రజలతో మమేకమై విజయమే లక్ష్యంగా పని చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆ పథకాలే పార్టీకి విజయాన్ని తెచ్చిపెడతాయన్నారు. త్వరలో మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్, ఆ పార్టీ నాయకులు బంగారం, నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్, సమద్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అరబిక్ విద్యార్థులకు పట్టాల ప్రదానం



దువా చేస్తున్న ముస్లిం మత గురువులు

వెలుగోడు: పట్టణంలోని జామియా సిరాజుల్ ఉలుమ్ అరబిక్ కళాశాలలో గత పది సంవత్సరాల నుంచి అరబిక్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల ప్రదాన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరు నగరానికి చెందిన హజరత్ మౌలానా ముఫ్తీ సాగిర్ అహమ్మద్‌ఖాన్, అతిథులుగా పీఎం మహమ్మద్ ముజమ్మిల్, మహమ్మద్ గౌస్ హాజరయ్యారు. కార్యక్రమంలో హాఫిజ్, అలీమ్, ఖారీ కోర్సులు పూర్తి చేసిన 118 మంది పట్టభద్రులకు పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం సామూహిక దువా చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహానందిలో సండే సందడి



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

మహానంది: సెలవు రోజు కావడంతో ఆదివారం మహానందిలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం జరిగిన అభిషేకం, అష్టవిధ మహా మంగళ హారతుల సమయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మహానందీశ్వర స్వామి దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మేలు జరిగిందనుకుంటే జగనన్నకు అండగా నిలవండి

- సంక్షేమ పథకాల అమలులో మహిళలకు పెద్దపీట
- మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలి
- ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- జూపాడుబంగ్లా, పగిడ్యాలలో ఆసరా సంబరాలు





జూపాడుబంగ్లాలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సిద్ధార్థరెడ్డి, పొదుపు మహిళలు, పగిడ్యాలలో మెగా చెక్కును అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మేలు జరిగిందనుకుంటే అందరూ జగనన్నకు అండగా నిలిచి, మరోమారు సీఎంగా ఆశీర్వదించాలని ఏపీ శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కోరారు. ఆదివారం జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయం వద్ద ఏపీఎం అంబమ్మ అధ్వర్యంలో నాల్గొవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 725 పొదుపు గ్రూపులకు నాల్గొవ విడత ఆసరాగా మంజూరైన రూ.384.28లక్షల మెగాచెక్కు మహిళలకు అందజేశారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ పొదుపు మహిళలను అక్కా, చెల్లెమ్మలను మోసగించిన చరిత్ర చంద్రబాబుదేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మహిళల ఆర్థికాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీటవేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు రుణమాఫీ, సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా మొత్తాలను ఎప్పటికప్పుడు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు.

ప్రజల ఖాతాల్లో రూ.2.50లక్షల కోట్లు జమ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా మహిళల బ్యాంకు ఖాతాల్లో ఇప్పటిదాకా రూ.2.50లక్షల నగదును జమచేశారని సిద్ధార్థరెడ్డి తెలిపారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలను అమలుచేసి పేదవిద్యార్థులు కూడా కార్పొరేట్‌స్థాయి విద్యను అభ్యసించేలా చేశారన్నారు. వీటితో పాటు జగనన్నతోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, కాపునేస్తం ఇలా అనేక సంక్షేమ పథకాల అమలులో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు.

అభివృద్ధి కనపడటం లేదా?

జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి లేదని మాయమాటలు చెబుతున్న టీడీపీ వారికి గ్రామాల్లోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, నూతన ఆసుపత్రి భవనాలు, మారిన పాఠశాలల రూపురేఖలు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, జగనన్న కాలనీలు, పక్కాగృహాలు కనపడటం లేదా అన్ని సిద్ధార్థరెడ్డి ప్రశ్నించారు. టీడీపీ నాయకులు అధికారదాహంతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ నూర్జహాన్, పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచులు పీఎం నాగిరెడ్డి, మొట్టి బాలస్వామి, గొల్ల మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

875 సంఘాలకు సున్నావడ్డీ

వైఎస్సార్ సున్నా వడ్డీ కింద నాలుగు విడుతల్లో మండలంలోని 875 సంఘాలకు రూ. 6.35 కోట్లు, స్త్రీ నిధి అప్పు కింద 410 సంఘాలకు రూ. 5.23 కోట్లు, ఉన్నతి ద్వారా 159 సంఘాలకు రూ. 99.20 లక్షలు మంజూరు అయ్యాయని సిద్ధార్థరెడ్డి అన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద జీవనోపాధుల మెరుగు కోసం డెయిరీ, గొర్రెల పెంపకం యూనిట్లను స్థాపించుకుని 195 మంది సభ్యులు లబ్ధిపొందుతుండడం హర్షనీయమని పేర్కొన్నారు. మోసానికి బ్రాండ్ అంబాసిడర్ నారా చంద్రబాబునాయుడు అయితే నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ జగనన్ననే అని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో మోసపోయారని మళ్లీ ఆ పొరపాటు చేయొద్దని రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆసరా మెగా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిరాజు, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీటీసీ మిద్దె స్వాములు, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్లు వస్తున్నారు.. జాగ్రత్త !

పగిడ్యాల: టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, జనసేన పార్టీ కండువాలు వేసుకున్న మోసగాళ్లు వస్తున్నారు.. జాగ్రత్త అని, నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన 4వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ పేదలు ఆర్థిక సాధికారిత సాధించేందుకు నవరత్నాలు పథకాన్ని అమలు చేసి వారి అభ్యున్నతికి జగనన్న అహర్నిశలు శ్రమించారన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే నన్నారు. పొదుపు మహిళల రుణాలను మాఫీ చేయకుండా మోసం చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడులా కాకుండా రెండేళ్లు కరోనా వచ్చినా, రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా విడతల వారీగా 757 పొదుపు సంఘాలకు రూ. 27.28 కోట్లు మంజూరు చేసి మాట నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు జగనన్ననే అని గుర్తు చేశారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

పగిడ్యాల: దేశ ప్రజలకు, ఓబీసీ సమాజానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాలని ఓబీసీ మండల అధ్యక్షుడు శీధర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నెహ్రూనగర్ ఎల్లం బావి వద్ద రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ పుట్టుకతో ఓబీసీ కాదని, ఆ కులం ఓబీసీలో తర్వాత చేర్చబడిందని రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలు బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు అశ్విన్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అన్నపూర్ణాదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాదేవి గృహస్థాశ్రమంలో ఆదివారం శ్రీ అన్నపూర్ణాదేవి సమేత సనారీ విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆశ్రమ నిర్వాహకులు, శివోహం టెంపుల్ ట్రస్ట్ నిర్వాహకులు అరవింద రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కొన్ని ఆశ్రమాల పీఠాధిపతులు, గురుబిడ్డలు, గురు భక్తులు, సాధువులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా లక్ష్మీ గణపతి హోమం, చండీ రుద్రం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి భజన కార్యక్రమం జరిగింది.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు : పట్టణంలోని 6వ వార్డులో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ఆ వార్డు ఇన్‌చార్జ్ అహమ్మద్ రసూల్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఇటీవల పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా తమ వార్డులో పర్యటించారని చెప్పారు. ఆ సమయంలో కాలనీ వాసులు విద్యుత్ స్తంభాలు లేవని, రాత్రి వేళ చిమ్మచీకటిలో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారన్నారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి విద్యుత్ అధికారులు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు ఎట్టకేలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని తెలిపారు.

కైపా కుటుంబానికి పరామర్శ



శ్రీధర్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ పోచా, ఏపీ శాప్ చైర్మన్

మిడుతూరు: మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన కైపా శ్రీధర్‌రెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీధర్ రెడ్డి లేని లోటు తీర్చలేనిదని, మృతి చెందడం బాధకరమన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ నాగతులసి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీశైలం దేవస్థాన ఉద్యోగుల ఔదార్యం



మృతుని భార్యకు చెక్కు అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల కాలంలో దేవస్థాన ఆలయ విభాగంలో భజంత్రీగా విధులు నిర్వహిస్తున్న ఎ.డి.వి.లక్ష్మయ్య గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు దేవస్థాన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం తరుపున మృతుని భార్యకు రూ.2,51,399 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం శ్రీశైలంలోని దేవస్థాన పరిపాలన భవనంలో మృతుని భార్యకు దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు చేతుల మీదుగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బాలాజీ నాయక్ ఉన్నారు.

సేవలోనే ఆత్మసంతృప్తి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): సేవలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టౌన్‌హాల్ వద్ద ఉన్న తెలుగుతల్లి ఉద్యానవనంలోని ఆయుష్ యోగా కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆపద సమయంలో ప్రాణాపాయం నుంచి కాపాడే రక్తదాతలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవా భావంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని, తమవంతుగా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. యోగాతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆనంద్ గురూజీని అభినందించారు. అనంతరం 42 మంది రక్తదానం చేశారు. శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఈసీజీ, టుడీ ఎకో, ఎముకలు, కీళ్లు, బీపీ, షుగర్, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించారు. గెలివి సహదేవుడు, ఫణిల్‌కుమార్, కౌన్సిలర్ కండే శ్యాంసుందర్‌లాల్, దస్తగిరి, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

బేతేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో బేతేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలో ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయం శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంలో మునిగిపోయింది. దీంతో ఆలయాన్ని నూతనంగా నిర్మించుకునేందుకు పనులు ప్రారంభించామని గ్రామస్తులు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణానికి దేవదాయ శాఖ నుంచి రూ.80లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఈ మొత్తంతో పాటుగా రూ.20 లక్షలు ఆలయ నిర్మాణం కోసం దేవదాయ శాఖలో డిపాజిట్ చేశామని.. మొత్తం కోటీ రూపాయాలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకుడు నాగరాజు తెలిపారు. భక్తులు, ప్రజల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తిచేయిస్తామని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పెద్దలింగస్వామి, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు: పట్టణంలోని రషీద్ కంప్లెక్స్‌లోని క్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్ మాట్లాడుతూ రోగులకు ఉచితంగా బీపీ, షుగర్, వైద్య పరీక్షలతో పాటు గుండె పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ షామిసుల్తానా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

ఆత్మకూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 18న అనంతపురంలో జరుగనున్న సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టవలసిన చర్యలపై సమావేశంలో చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి శ్రీశైలం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు న్యాయం చేయాలి

నంద్యాల(అర్బన్): 98 డీఎస్సీలో మిగిలిపోయిన క్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలు ఇవ్వాలని 98 డీఎస్సీ రిమైనింగ్ క్వాలిఫైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో క్వాలిఫైడ్‌లందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత ఏడాది 4వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, అందులో రిజర్వేషన్ పాటించకపోవడంతో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి మిగిలిన వారందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే వారంలో విజయవాడకు వెళ్తున్నాని, తన వెంట వస్తే మీ సమస్యకు పరిష్కారం చూపుతానని ఎంపీ పోచా హామీ ఇచ్చారన్నారు. నాయకులు చిన్ని కృష్ణుడు, సంజీవ, భాగ్యమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రైతునగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీగౌరీ కేదార్‌నాథ్ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ప్రారంభం కాగా, ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయాన్నే వేదపారాయణం, వాస్తు పూజ, హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రతిష్ఠ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని, చివరి రోజు బుధవారం విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టి, హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించి వేడుకలను ముగిస్తామని చెప్పారు. ప్రతి రోజూ సాయంత్రం కోలాటం, భజనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బడిరోజులు గుర్తుకొస్తున్నాయి !



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జూపాడుబంగ్లా: 28 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలో కలుసుకొని ఒకరిని ఒకరు గుర్తుచేసుకొని ఆప్యాయంగా పలుకరించుకుంటూ.. ఆ నాటి అల్లరిచేష్టలను గుర్తుచేసుకుంటూ పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సంతోషంగా గడిపారు. మండలంలోని పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణ జరిగింది. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు దేవదాసు, ఉదయభాస్కర్, రాబర్ట్, కృష్ణమూర్తి, హిమకుమార్, మధుసూదనశర్మ, వెంకటరమణ, పరమేశ్వరుడు, కిరణ్‌కుమార్, జయన్న, సుంకన్న, శ్రీనివాసులు, గఫూర్, మగ్బూల్, ఓబులేసు, భాగ్యమ్మలను పూర్వ విద్యార్థులు శాలువాకప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పోచా రాజశేఖర్‌రెడ్డి, ఎల్లన్న, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ముత్తు, వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

వెలుగోడు: పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, పూజా ద్రవ్యాలతో కలశాలతో పొట్టిశ్రీరాములు సెంటర్ నుంచి ఊరేగింపుగా అమ్మవారి శాలకు చేరుకున్నారు. అక్కడ పురోహితులు నర్సరామ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి శాల కమిటీ ఆధ్వర్యంలో పాల్గొన్న ఆర్యవైశ్యులందరికీ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ కమిటీ అధ్యక్షుడు లాలం సుధాకర్, కమిటీ సభ్యులు నాగపుల్లయ్య, నాగేశ్వరరావు, లాలం జనార్దన్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతిలో పటిష్ట భద్రత



కొలనుభారతిలో ఆలయ సిబ్బంది, పోలీసులకు సూచనలిస్తున్న సీఐ

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషన్ తెలిపారు. ఆదివారం మండలంలోని శివపురం సమీపంలోని కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలను, ఎక్కడెక్కడ పోలీసు భద్రత అవసరం, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అశోక్, ఈఓ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 14న అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించనున్న వసంత పంచమి వేడుకల్లో భక్తులకు, సందర్శకులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం శివపురం గూడెంవద్ద వాహనాల పార్కింగ్ నిర్వహిస్తామని, అక్కడి నుంచి భక్తులను ప్రత్యేక బస్సుల్లో ఆలయం వద్దకు తరలిస్తామన్నారు. భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటాలు



యూటీఎఫ్ లోగో ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కర్నూలు (సిటీ) : ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్‌ను స్థాపించి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఆదివారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాలలో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. సంఘం పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం సాధించే విడతల వారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహులు, యూటీఎఫ్ సంఘం తొలి జిల్లా ప్రధాన కార్యదర్శి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, ఆ సంఘం సభ్యులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, రాష్ట్ర నాయకులు నాగమణి, యల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు సుధీర్ రాజు తదితరులు పాల్గొన్నారు.